# 71st Republic Day Celebrations at Dravidian University

## ద్రావిడ విశ్వవిద్యాలయంలో ఘనంగా గణతంత్ర దినోత్సవ వేడుకలు

తేది:26.01.2020

ద్రావిడ విశ్వవిద్యాలయంలో 71వ గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆదివారం ఉదయం వర్శిటీ నూతన అకడమిక్ భవనం వద్దనున్న మహాత్మా గాంధీ విగ్రహానికి వర్శిటీ ఉపాధ్యక్షులు ఆచార్య జి.లోకనాథరెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఓపెన్ ఎయిర్ ఆడిటోరియం వద్ద జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా ఆచార్య జి.లోకనాథరెడ్డి గారు మాట్లాడుతూ... స్వాతంత్ర్య సమరంలో ఎంతో మంది దేశభక్తులు, నాయకులు పాల్గొని మన దేశానికి స్వాతంత్ర్యాన్ని 1947లో తీసుకొచ్చారని అన్నారు. దాని తరువాత 1950 జనవరి 26 నుంచి మన భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చిందన్నారు. ఆ రోజు నుంచి ప్రతి సంవత్సరం జనవరి 26న భారత గణతంత్ర దినోత్సవంగా జరుపుకుంటూ ఈ రోజు 71వ సంవత్సరంలోకి మనము అడుగు పెట్టడం జరిగిందన్నారు. గడిచిన కాలంలో మన దేశాభివృద్ధి, రాష్ట్రాభివృద్ధిని బేరీజు వేసుకుంటూ గడచిన 20 సంవత్సరాలుగా మన విశ్వవిద్యాలయ అభివృద్ధిని కూడా మనం పరిగణలోకి తీసుకొని ప్రతి ఒక్కరూ విశ్వవిద్యాలయ అభివృద్ధికి పాటుపడాలన్నారు. విద్యార్థులు పరిశోధనల ద్వారా మన విశ్వవిద్యాలయ ప్రగతిని ముందుకు తీసుకెళ్ళాలన్నారు. రాజ్యాంగంలో పొందుపర్చిన హక్కులతో పాటు విధులను కూడా ప్రతి ఒక్కరూ పాటించాలన్నారు. డా.బి.ఆర్.అంబేద్కర్ ఎన్నో కలలు కని రచించిన భారత రాజ్యాంగాన్ని ప్రతి ఒక్కరూ మనసావాచా కర్మణా ఆచరిస్తూ సమాజంలో ఉన్న అన్ని అసమానతలను రూపుమాపడానికి కృషి చేయాలన్నారు. భారతదేశ జెండాలో ఉన్న రంగులను వాటి ప్రాముఖ్యతను వివరిస్తూ కాషాయం ధైర్యానికి, తెలుపు నిర్మలత్వానికి, ఆకుపచ్చ అభివృద్ధికి సూచనలుగా మన తెలుగు వారైన శ్రీ పింగళి వెంకయ్య గారు రూపొందించారని అన్నారు. అనంతరం విద్యార్థులచే దేశభక్తి గీతాలను ఆలపించారు.

ఈ కార్యక్రమం అనంతరం పొగాకు రహిత సమాజానికి కృషి చేసేందుకు ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో అందరి చేత ప్రతిజ్ఞ చేయించారు. ఈ ప్రతిజ్ఞలో ప్రతి ఒక్కరూ తమ కుటుంబంలో ఎవరే గానీ పొగాకు ఉత్పత్తులు వాడకుండా ఉండేందుకు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులు మరియు ఇతర సిబ్బంది పొగాకు రహిత సమాజానికి మేము తోడ్పాటునందిస్తామని ప్రతిజ్ఞ చేశారు.

ఈ కార్యక్రమంలో వర్శిటీ రిజిస్ట్రార్ ఆచార్య టి.అనురాధ, అకడమిక్ డీన్ ఆచార్య శ్రీనివాసకుమార్, పీఠాధిపతులు, శాఖాధిపతులు, బోధన బోధనేతర సిబ్బంది, పరిశోధక విద్యార్థులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.






DRAVIDIAN
NSS

